కాలువలు అన్యాక్రాంతం


వర్షపు నీటికి దెబ్బతిన్న వరి


కొబ్బరి తోటలో చేరిన నీరు

రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ స్వార్థితం కోసం ఏళ్లనాటి రాజ్ కాలువలను పూడ్చివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. దీంతో కాలువలు పూడిపోవడంతో వరద నీరు పంట పొలాలపై ప్రవహిస్తోంది. వరి, కొబ్బరి చెట్లు భారీ వర్షాలకు నీటిపాలై రైతులు నష్టాల బారిన పడుతున్నారు. రాజు కాలువలు పర్యవేక్షించి ఆక్రమణలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో కాలువలు అన్యాక్రాంతమవుతు న్నాయి. – కుప్పం

- రియల్ ఎస్టేట్ వ్యాపారుల నిర్వాకం
- ఏళ్లనాటి రాజ్ కాలువలు పూడ్చి వేసిన వైనం
- భారీ వర్షాలతో పంట పొలాలపైకి వర్షపు నీరు
- వర్షం నీటితో మునిగిన వరి పంట

మున్సిపాలిటీ సమీపంలోని గుడుపల్లె మండలం గుండ్లసాగరం రెవెన్యూ లెక్క దాఖల్లో సర్వే నెం.80 సబ్ డివిజన్‌లో 10 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఈ ప్రాతంలో ఉన్న నాలుగు రాజ్ కాలువలు పూడ్చి వేసి లేట్ అవుట్‌లకు దారిగా మార్చేశారు. అధికారులు, స్థానికులు ప్రశ్నిస్తే లే అవుట్‌లకు కాలువలను వినియోగించుకోలేదని, కేవలం ప్రజలకు రాకపోకలకు రోడ్డు సౌకర్యం కల్పించామని నచ్చజెప్పి చేతులు ఎత్తేశారు. గుండ్లసాగరం వద్ద ఉన్న గొనికుంట, లేఅవుట్‌కు పైఉన్న గుత్తార్లపల్లి గుట్ట నుంచి, చెక్ డ్యాం నుంచి ప్రవహించే వర్షపు నీరు రాజ్ కాలువ నుంచి డీకేపల్లి చెరువు, కుప్పం చెరువుకు వచ్చేది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాలుగు రాజ్ కాలువలను పూర్తి మూసివేశారు. ఎటు చూసినా లే అవుట్ ప్లాట్‌లే తప్ప వ్యవసాయ పొలాలు, గుట్ట ఆ సర్వే నెంబర్లు మాయమయ్యాయి. కాలువలను అంతా పూడ్చి వేసి, లే అవుట్‌లకు రోడ్డు చేసుకున్నా పట్టించుకునేవారు లేరు.

నీట మునిగిన పంటలు

గత వారం రోజులుగా కుప్పంలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. దీంతో చెరువులు , వాగులు, వంకలు నిండి ప్రవహిస్తున్నాయి. గుండ్లసాగరం పంచాయతీ పరిధిలోని లే అవుట్‌లో వర్షపు నీటి ప్రవాహానికి మార్గం లేకుండాపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న పంట పొలాలపై నీరు ప్రవహించింది. దీంతో వరి, కొబ్బరి చెట్లు వర్షపు నీటితో దెబ్బతిన్నాయి. వరి పంటలతోపాటు ఇతర కూరగాయలు, పశుగ్రాసం పంటలు సైతం దెబ్బతిన్నాయి. భారీవర్షాలు కురిస్తే మిట్ట ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీటి ప్రవాహానికి ఆదరువుగా వున్న కాలువలు పూడి పోవడంతో భవిష్యత్తులో కుప్పం మున్సిపాలిటీకి పెను ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రాజ్‌కాలువలు పూడ్చి వేసి వేసిన లే అవుట్

క్లుప్తంగా

ఆయుధపూజ


ఆయుధ పూజలో జెడ్పీటీసీ సభ్యుడు, పంచాయతీ అధికారులు, సిబ్బంది

సదుం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా ఆయుధ పూజ చేశారు. పంచాయతీ వాహనాలు, వస్తువులకు పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: మండలంలోని పంజాణి సత్రం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ బాలాజి మంగళవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంటలు చేశారా, లేదా? వంటకాలు రుచికరంగా ఉన్నాయా, లేవా? అని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. నిర్వాహకులు కచ్చితంగా వంటకాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పరిసరాల శుభ్రతతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. అలాగే వర్షపు నీరు పాఠశాలలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లతను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయురాలు ప్రియాంక పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లి: లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బైరెడ్డిపల్లె బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు పోషకాహారం బాగా తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. బాల్యవివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేశమ్మ, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడి


పొలంలో ఏనుగులు విరిచేసిన అరటిచెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట పంటలపై ఏనుగుల దాడులు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా మంగళవారం తెల్లవారు జామున మండలంలోని పాళెం, కొంగరవారిపల్లె, మర్రికుంటవారిపల్లె పరిసర ప్రాంతాల్లో తపంటలపై ఏనుగుల గుంపు పడి నాశనం చేసాయి. పాళెంలో అరటి చెట్లు, కొంగరవారిపల్లెలో కొబ్బరి చెట్లను, మర్రికుంటవారి పల్లెలో మామిడి కొమ్మలను విరిచేశాయి. చేతికొచ్చిన పంటలు ఏనుగుల దాడుల్లో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

జీఎస్టీపై ప్రచారం.. సమస్యలు యథాతథం

పలమనేరు: పలమనేరు మున్సిపల్ అధికారులు చెత్తకుప్పల తరలింపు, పర్యవేక్షణ పక్కనబెట్టి జీఎస్టీపై ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ఇటీవల జీఎస్టీ తగ్గించిన వాహనాలు, పరికరాల వ్యాపారులతో మున్సిపల్ అధికారులు తమ కార్యాలయం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్థానిక సమస్యలను గాలికొదిలేసి ..జీఎస్టీ తగ్గింది..చౌక ధరలంటూ విక్రయాల ప్రచార పర్వానికి తెర దీశారు. సమస్యలను పక్కనబెట్టి ఇలా చేయడం ఒకింత విమర్శలకు తావిస్తోంది.


మున్సిపల్ కార్యాలయం వద్ద స్టాల్స్ పెట్టి మరీ అమ్మకాలు చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి

'పచ్చ పత్రికలకు ఇది తగదు'

రొంపిచెర్ల: అక్రమ మద్యం కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిపై బురద చల్లడం పచ్చ పత్రికలకు తగదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి మాట్లాడారు. అక్రమ మద్యం కేసులో ఎంపీకి క్లీన్ చిట్ ఇచ్చి బెయిల్ మంజూరు చేయడం పచ్చ పత్రికలకు రుచించడం లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో పార్టీ నాయకులు చింతల ద్వారకనాథరెడ్డి, బాలాజీ, కమలాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

బస్సు షెల్టర్లు లేక అవస్థలు


రామసముద్రంవెళ్లే రోడ్డుపై నిలబడి ఉన్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై నుంచి బెంగళూరుకి వెళ్లే రహదారి, రామసముద్రంకు వెళ్లే రహదారిలో బస్సు షెల్టర్లు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే రెండు ప్రధాన రహదారి కూడలి ప్రాంతాలలో బస్సు షెల్టర్లు నిర్మించాలని ఎన్నో సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. రామసముద్రం రహదారిలో విద్యార్థులు ఎండకు, వానకు తడుస్తూ రోడ్డుపైనే నిలుచుకుని బస్సులు, ఆటోల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఎక్కువ మంది విద్యార్థులు రోడ్డుపైనే నిలబడి ఉండాల్సిన దుస్థితి నెలకొనడంతో ప్రమాదాలు కూడా తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఈరెండు ప్రాంతాలలో బస్సు షెల్టర్ల నిర్మాణానికి పూనుకోవాలని పలువురు కోరుతున్నారు.

మద్యం మత్తులోనే తప్పుడు ప్రచారం!

- టీడీపీకి ఓటేస్తే నాశనమే అంటూ దినేష్ అనే యువకుడి వీడియో వైరల్
- మద్యం మత్తులో అలా మాట్లాడాడు: డీఎస్పీ సాయినాథ్
- ఆపై కొన్నిగంటలకే తనకు ప్రాణహాని లేదని చెప్పిన దినేష్



పూతలపట్టు(యాదమరి): గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన టీడీపీ కార్యకర్త దినేష్ సెల్ఫీ వీడియోపై డీఎస్పీ సాయినాథ్ స్పందించారు. మంగళవారం ఆయన పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆదివారం సాయంత్రం రంగంపేట క్రాస్ రోడ్డులో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పులిచెర్ల మండలం నుంచి మహేష్ అనే వ్యక్తి రెండు కార్లలో చిత్తూరు వైపుగా వచ్చాడన్నారు. అదే సమయంలో రామాపురం గ్రామానికి చెందిన దినేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో ముందు వెళ్తున్న కారును ఢీకొన్నాడని, ఆ సమయంలో అక్కడికి సాయం చేయడానికి వచ్చిన స్థానికులను కూడా దినేష్ మత్తులో దుర్భాషలాడాడని తెలిపారు. దీంతో పోలీసులు అతన్ని పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారన్నారు. అనంతరం అతను తన కూతురు సహస్రను తీసుకుని రాత్రి పోలీసు స్టేషన్‌లో తప్పుడు వీడియో తీసి ప్రచారం చేశాడన్నారు. డ్యూటీలో ఉన్న పోలీసుల విధులకు భంగం కల్పించడంతో అతనిపై మరో కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా డీఎస్పీ విలేకరుల సమావేశం ముగిసిన కొన్ని గంటలలోనే ఈ ఘటనపై బాధిత వ్యక్తి పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తెలుగుదేశం నాయకుల నుంచి తమ కుటుంబానికి ఎలాంటి హానీ లేదని..తాను కేవలం మత్తులో ఉండడంతోనే వీడియో తీశానని చెప్పడం గమనార్హం.

మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతపై వర్క్‌షాప్

తవణంపల్లె: అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అపోలో మెడికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణ వర్క్‌షాప్‌ను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరించారు. మనిషి ఆరోగ్యవంతంగా జీవించడం అలవరచుకోవాలన్నారు. మానసిక రోగులు మానసిక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య పరీక్షలు ఎలా చేయించుకోవాలనే పలు విషయాలపై సూచనలు-సలహాలిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వైష్ణవిదేవి ఆలయంలో సర్పదోష నివారణ పూజలు

చౌడేపల్లె: మండలంలో పుదిపట్లలోని శ్రీ వైష్ణవీదేవి ఆలయంలో మంగళవారం సర్పదోష, కుజ దోష ని వారణ పూజలు నిర్వహించారు. అష్టమి సందర్భంగా నాగ భైరవస్వామికి పంచదీపారాధన చేశారు. సర్పదోషం, కుజ దోషం ఉన్నవారు స్వామివార్లకు శాంతి నివారణ పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


సర్ప, కుజ దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

భక్తులతో బోయకొండ కిటకిట



క్యూలలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీతో క్యూలన్నీ కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అందంగా ముస్తాబుచేశారు. కోర్కెలు ఫలించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

డేంజర్..డేంజర్!

వి.కోట: కరెంటు స్తంభాల పెచ్చులూడి కూలేస్థితిలో ఉన్నా సంబంధిత అధికారులు మార్చడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని ముదరందొడ్డిలోని కరెంటు స్తంభాలు దీనికి సాక్షీభూతంగా నిలాచాయి. ఇక్కడ స్తంభాలు పూర్తి స్థాయిలో పెచ్చులుడి ఇనుప కమ్మీలు సైతం తేలాయి. ప్రస్తుతం వర్షాలకు ఒకవేళ స్తంభం నుంచి విద్యుత్ సరఫరా అయితే ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు దీనిని మార్చాలని కోరుతున్నారు.


పెచ్చులూడి కమ్మీలు తేలిన విద్యుత్ స్తంభం

టీబీ ముక్తభారత్ సర్వేపై సమీక్ష

తవణంపల్లె: మండలంలో టీబీ ముక్తభారత్ సర్వేను సకాలంలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీలు స్క్రీనింగ్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వారం రోజుల్లో వందశాతం పూర్తిగా చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి రిపోర్టు పంపాలని ఆదేశించారు. టీబీ అనుమానితులను మరోసారి ఎక్స్‌రే పరీక్షలు చేయించి నిర్ధారించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు గోపి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎల్‌టీ శేఖర్ పాల్గొన్నారు.


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్

రైతుల ఖాతాల్లో మామిడి మద్దతు ధర జమ

గంగవరం: ప్రభుత్వం ప్రకటించిన మామిడి కిలో మద్దతు ధర రూ. 4 మంగళవారం విడుదలైనట్లు హార్టికల్చర్ ఆఫీసర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గతంలో మామిడి మద్దతు ధర కోసం నమోదు చేసుకున్న 481 మంది రైతులకు, 6127.3 మెట్రిక్ టన్నులకు గానూ రూ. 2.45 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ సొమ్మును ఆధార్ లింక్ కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలియజేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: మండలంలోని మామిడి రైతులకు కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ వారి ఖాతాలలో జమ చేస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారి వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 మంది మామిడి రైతులకు 53 మెట్రిక్ టన్నులకు సబ్సిడీ నగదు విడుదలైందని, ఆధార్ అనుసంధానం ఉన్న రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ సొమ్ము జమ చేసినట్టు తెలియజేశారు.

చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం జెడ్పీ హైస్కూలు ఆవరణలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ మండల కన్వీనర్ శశికుమార్ మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీసేందుకు ప్రతి ఏటా చెకుముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లాస్థాయిలో నవంబర్ 23న నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ప్రసాద్, రేఖ, నాగరాజు, సీఆర్‌పీ రామచంద్ర పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ ధనుంజయ్ మాట్లాడుతూ, చదువుతో ఉద్యోగాలే ముఖ్యం కాదని, మంచి వ్యాపారాలు చేస్తే ఉన్నతస్థానానికి చేరుకోవడంతోపాటు పది మందికీ ఉపాధి కల్పించవచ్చన్నారు. 60మంది విద్యార్థులకు క్యూఆర్ కోడ్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేష్టం


పోషకాహారం పంపిణీ చేస్తున్న సిబ్బంది

సదుం: తల్లిపాలే శిశువుకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని గంటావారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భవతులకు పోషకాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.